క్లుప్తంగా

సత్తెమ్మ తల్లికి అభిషేకాలు



అమ్మవారి అభిషేకాలు చేస్తున్న అర్చకులు రాఘవరాం

బిక్కవోలు: స్థానిక జువ్వలదొడ్డి కొలువైన సత్తెమ్మ తల్లికి అమ్మవారి భారీ ఎత్తున్న అభిషేకాలు నిర్వహించారు. శ్రావణ మాసం ఆదివారం పురస్కరించుకుని అర్చకులు బిక్కవోలు రాఘవరాం అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ సందర్భంగా భక్తులు వచ్చి అమ్మవారి దర్శించుకుని అభిషేకాలు పాల్గొన్నారు.

శివాలయం పునర్నిర్మాణానికి నేడు భూమిపూజ



పునర్నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్న ఆలయ కమిటీ

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట గ్రామంలో ఉన్న ఉమారాలింగేశ్వర, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్ల దేవాలయ పునర్నిర్మాణానికి భూమిపూజ, శంకుస్థాపన చేయనున్నట్టు శివాలయం ఆలయ కమిటీ తెలిపింది. 160 సంవత్సరాల విశిష్ట చరిత్ర కలిగినటువంటి జంట దేవాలయాలు దేవదాయశాఖ, గ్రామస్తుల సహాయ, సహకారాలతో నిర్మిస్తున్నారు. సోమవారం జరిగే జంట దేవాలయాల భూమిపూజ కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని ఆలయ కమిటీ కోరింది.

ఆదిత్యునికి పంచామృతాభిషేకాలు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవునికి ఆదివారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆలయంలో వ్రత పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీవారు, తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

విద్యుత్ స్తంభాలతో జాగ్రత్త

రంగంపేట: గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు విద్యుత్ స్తంభాలకు విద్యుత్ సరఫరా అయ్యే అవకాశం ఉంటుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్తు శాఖ అధికారులు సూచించారు. ఒక వేళ విద్యుత్ స్తంభాలకు విద్యుత్తు సరఫరా అవుతున్నట్టు అనిపిస్తే అటుగా వెళ్లకుండా ఉండడంతో పాటు ఆ విషయాన్ని అధికారులకు తెలియజేయాలని కోరారు. వర్షాలు తగ్గేంత వరకు ప్రజలు అప్రమత్తతతో ఉండాలని సూచించారు. ఏదైనా సమస్య వచ్చిన వెంటనే స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌కు తెలియజేయాలన్నారు.

నీటి తీరువా వసూళ్లు

బిక్కవోలు: నీటి తీరువా వసూళ్ల వేగవంతం చేయాలని తహసీల్దార్ బి.ఎస్‌వీవీ కృష్ణ అన్నారు. మొబైల్ గ్రూప్ ద్వారా ఆదివారం వీఆర్వోలతో మాట్లాడుతూ మండలంలోని రూ.47,86,082 ఇంకా వసూళ్లు చేయాల్సి ఉందన్నారు. బిక్కవోలు రూ.13,82,980, పందలపాక 8,71,785, ఊలపల్లి రూ.7,04,547, కొంకుదురు రూ.4,75,568, కొమరిపాలెం రూ.3,45,983, బలభద్రపురం రూ.2,16,098, గ్రామాల్లో అత్యధిక వసూళ్ల చేయాల్సి ఉందన్నారు. ఈ నెలలో ఎక్కువ శాతం వసూళ్ల చేయాలని వారిని ఆదేశించినట్లు ఆయన తెలిపారు.

రహదారుల అభివృద్ధికి కృషి

పెదపూడి: నియోజకవర్గంలోని గ్రామాల్లో రహదారుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అచ్యుతాపురత్రయం గ్రామంలో సుమారు రూ.27లక్షలతో నిర్మించే 5 రోడ్లుకు ఎమ్మెల్యే ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోడ్లను సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అడబాల అనురాధ, ఎంపీటీసీ సభ్యురాలు పెండెం జ్ఞాన ప్రసూన, సచివాలయం కార్యదర్శి కొమ్మన తరుణ్, నాయకులు ఆరుమిల్లి సత్యభారతి ప్రసాద్, అడబాల విష్ణు, పెండెం అప్పన్న, ముమ్మిడి శివ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం

సీతానగరం: మండలంలోని మునికూడలి పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ ఆదివారం ప్రమాణ స్వీకారం చేసింది. సొసైటీ వద్ద జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి పాల్గొన్నారు. చైర్‌పర్సన్‌గా సానిపిని వెంకట రామారావు, పర్సన్‌లుగా మల్లి వెంకట సత్యనారాయణ, పెరుగు సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేశారు.

ఏటిగట్టు.. ప్రయాణం నరకమే ఒట్టు..

- శిథిలావస్థకు చేరిన సీతానగరం–పురుషోత్తపట్నం రోడ్డు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు, రైతులు
- పట్టించుకోని అధికారులు



అధ్వానంగా ఉన్న సీతానగరం- పురుషోత్తపట్నం ఏటిగట్టు రోడ్డు



ఏటిగట్టు రోడ్డు దుస్థితి

సీతానగరం: కూటమి ప్రభుత్వం వస్తుంది. రోడ్లను బాగుజేస్తుందని చూసిన ప్రజలకు నిరాశే ఎదురైంది. రహదారులు గోతులమయంగా దర్శనమిస్తున్నా పట్టించుకోవడంలేదు. దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా ఏటిగట్టు రోడ్డు అధ్వానంగా ఉంది. రోడ్డు శిథిలావస్థకు చేరడంతో ప్రయాణికులు, వాహనదారులు నరకం చూస్తున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

శిథిలంమైన ఏటిగట్టు రోడ్డు

సీతానగరం – పురుషోత్తపట్నం పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన పదిన్నర కిలోమీటర్ల ఏటిగట్టు రోడ్డు ప్రధానమైంది. ఈ రోడ్డు నుంచే పాపికొండల పర్యాటకులు వెళుతుంటారు. నిత్యం ప్రైవేట్ బస్సులు, కారులు, ఆటోలు, ఇతర వాహనాలు పోలవరం ప్రాజెక్ట్‌కు నిత్యం తిరుగుతునే ఉంటాయి. పది కిలోమీటర్లు ఏటిగట్టు రోడ్డు పూర్తిగా దెబ్బతింది. వర్షాలకు మరింత దారుణంగా తయారైంది. గతంలో సింగవరానికి చెందిన యువకుడు స్కూటీపై వెళుతూ గోతులను తప్పించబోయి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొని చికిత్స పొందుతూ మృతి చెందాడు. నిత్యం ఆర్టీసీ బస్సులు మరమ్మతులకు గురవుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు గోతులను తప్పించే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నారు. అదే విధంగా నిత్యం వాహనాలు ఢీకొనడంతో గాయాలపాలై ఆసుపత్రి పాలవుతున్నారు. ఈ రోడ్డు ప్రయాణం దుర్బరంగా ఉందని వాహన చోదకులు వాపోతున్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి కూటమి నాయకులు అట్టహాసంగా శంకుస్థాపన చేసి నాలుగు నెలలు పూర్తైనా ఇప్పటి వరకు ఎటువంటి రోడ్డు పనులు చేపట్టలేదు. దీంతో మండల ప్రజలు ఆందోళన వ్యక్తం ఏస్తున్నారు.

రూ.11.01 కోట్ల నిధులు మంజూరు

సీతానగరం నుంచి పురుషోత్తపట్నం పంచాయతీరాజ్ రోడ్డు 10.2 కిలోమీటర్లకు ఎన్ఆర్‌ఈజీఎస్, నాబార్డు నిధులు రూ.11.01 కోట్లు మంజూరు చేశారు. సింగవరం నుంచి పురుషోత్తపట్నం వరకు 6.6 కిలోమీటర్ల ఏటిగట్టు రోడ్డుకు ఎన్ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.7.76 కోట్లు, సీతానగరం నుంచి సింగవరం వరకూ 3.06 కిలోమీటర్లుకు నాబార్డు నిధులు రూ.3.25 కోట్లు మంజూరు చేశారు. ఇంకా పనులు చేపట్టలేదు. సింగవరం నాగరత్నం కాలనీ ఏటిగట్టు నుంచి పురుషోత్తపట్నం వరకూ ఎనిమిది ప్రాంతాల్లో అధిక వర్షాలకు గ్రామాల వైపు ఏటిగట్టు కోతకు గురై ఉండడంతో అక్కడ పెద్ద రాళ్లతో టోవాల్ ఏర్పాటు చేసి అందులో మట్టిని నింపి రోడ్డు వేయాల్సి ఉంది. ఆ పనులు నత్తనడకన సాగుతున్నాయి. నాబార్డు మంజూరు చేసిన నిధులతో రోడ్డు వేయడానికి టెండర్ల దశలో ఉంది. అగ్రిమెంట్ కుదిరిన తరువాత పనులు ఎప్పటికో ప్రారంభిస్తారు.

పట్టించుకోని ప్రజాప్రతినిధులు

స్థానిక ప్రజాప్రతినిధులు ఏటిగట్టు రోడ్డు విషయంలో పట్టించుకున్న దాఖలాలు లేవు. అధికారులపై పర్యవేక్షణ చేస్తూ రోడ్డు విషయంపై ఎటువంటి సమాచారం సేకరించడం లేదు. శంకుస్థాపన చేశాం, మా పని అయింది అన్న విధంగా వారి వ్యవహారశైలి ఉందని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శాంక్షన్ అయిందని అట్టహాసంగా, హడావుడిగా శంకుస్థాపన చేసి వదిలేశారని ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. అధిక వర్షాలకు ఏటిగట్టు రోడ్డు గోతులమయంగా వాహనదారులకు నరక దారిగా తయారైంది. శాంక్షన్ అయిన ఏటిగట్టు రోడ్డుపై ప్రజాప్రతినిధులు దృష్టిసారించి పనులు వేగవంతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రయాణం నరకప్రాయం



సీతానగరం – పురుషోత్తపట్నం పది కిలోమీటర్ల ఏటిగట్టుపై ప్రయాణం నరకంగా మారింది. హైదరాబాద్ నుంచి బంధువుల ఇంటికి వచ్చాం. ఏటిగట్టు రోడ్డుపై ప్రయాణం అంటేనే భయపడేలా ఉంది. కారు వెళ్లడానికి ఖాళీ లేకుండా గోతులు పడ్డాయి. ఇక్కడ ప్రజలు ఆ రోడ్డుపై ప్రయాణం చేస్తున్నారంటే ఆశ్చర్యమేసింది. రోడ్డుపై మరమ్మతులతో ఆర్టీసీ బస్సులు నిలిచి ఉన్నాయి. ప్రయాణికులు ఇంత ఇబ్బంది పడుతున్నా రోడ్డు వేయడం లేదో తెలియడంలేదు.

– పి.విజయ్ కుమార్, హైదరాబాద్

రైతులకు మరింత ఇబ్బంది



సీతానగరం నుంచి పురుషోత్తపట్నం ఏటిగట్టు రోడ్డుపై రైతులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రైతులైతే చెప్పనక్కర్లేదు. పంటకు ఎరువులు తీసుకువెళ్లాలంటే భయపడుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో పంటపొలాలకు రైతులు ముమ్మరంగా ఎరువులు, కూలీలను తరలిస్తారు. నాలుగు నెలలు క్రితం రోడ్డుకు శంకు స్థాపన చేసి వదిలేశారు. వర్షాలకు గోతుల్లో నీరు చేరి ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రజాప్రతినిధులు దృష్టిపెట్టాలి.

– వలవల వెంకట్రాజు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి, సీతానగరం

ఏటిగట్టుకు వాల్ ఏర్పాటు

నాగరత్నం కాలనీ ఏటిగట్టు నుంచి పురుషోత్తపట్నం వరకు గ్రామాల వైపు ఏటిగట్టు కోతకు గురైంది. అది ఎనిమిది ప్రాంతాల్లో కోతకు గురైనట్టు గుర్తించాం. బండరాళ్లతో వాల్ ఏర్పాటు చేసి, మట్టి నింపి రోడ్డు వేస్తాం. పాత రోడ్డు ఎంత ఉందో అంతే రోడ్డు వేస్తాం. ఇరువైపుల బెర్మలు ఏర్పాటు చేస్తాం. సీతానగరం నుంచి సింగవరం వరకు నాబార్డు నిధులతో పనులు చేస్తాం. టెండర్లు ఖరారు కాలేదు. అగ్రిమెంట్ జరిగితే పనులు ప్రారంభిస్తాం.

–శ్రీనివాస్, పంచాయతీ రాజ్ ప్రాజెక్ట్ డీఈ

అప్పులు చేస్తే రాష్ట్రం స్వీడన్ అవుతుందా?

- పీ4 అంతా బూటకమని పచ్చమీడియానే చెబుతోంది
- అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి



అనపర్తి: అప్పులు చేస్తే రాష్ట్రం స్వీడన్ అవుతుందా అని అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి ప్రజలకు సంక్షేమ పథకాల కోసం పాలనాపరమైన సహేతుకమైన రుణాలు చేస్తే శ్రీలంక అయిపోతుందంటూ అప్పటి ప్రతిపక్ష పార్టీలైన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, జనసేన, బీజేపీ పార్టీలు గోబెల్స్ ప్రచారాలు చేశాయని, కానీ ఏడాది తిరగకుండానే సుమారు రూ.2లక్షల కోట్లు రుణాలు చేసి కనీస పథకాలు కూడా అమలు చేయని కూటమి ప్రభుత్వం చేసింది కరెక్టేనా అని అన్నారు. ఆదివారం ఆయన ఆనపర్తి పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు రకరకాల వాగ్దానాలు చేశాడన్నారు. మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని వాగ్దానం చేసి ఏడాది గడుస్తున్నా అతిగతిలేదన్నారు. తీరా చూస్తే పీ4 అంటు కొత్త పల్లవి అందుకున్నారని విమర్శించారు. దీనిపై చంద్రబాబును మోసే పచ్చమీడియా ఉతికి ఆరేసిందన్నారు. వారం రోజులు క్రితం ఆ మీడియా పీ4 అనేది నిరార్థక పథకమని అది ఆచరణ సాధ్యం కాదని కడిగి పారేసిందన్నారు. అనపర్తిలో స్థానిక ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పారిశ్రామికవేత్తలు, ఉద్యోగులు, దాతలు పీ4 పథకానికి సహకరించండి ప్రతిదానికి స్పాన్సర్ చేయండంటూ చెప్పడం జరిగిందని కాని ముందుగా మీరు అక్రమంగా సంపాదించిన కోట్లతో ఎంతమందికి సహకరిస్తున్నారు డాక్టర్ సూర్యనారాయణరెడ్డి నిలదీశారు. ఎంత మందికి చేయూతనిస్తున్నారు. ఎన్ని కుటుంబాలను బంగారు కుటుంబాలుగా మార్చుతున్నారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి తన అవినీతి సొమ్ముతో నియోజకవర్గంలో ఎన్ని కుటుంబాలకు సహకరిస్తారో సహకరించి మిగిలిన వారికి సహకారం అడిగితే బాగుంటుందన్నారు. ఇప్పటికైన వ్యాపారవేత్తలు, ఉద్యోగులను వదలి అక్రమ సంపాదనను ప్రజలకు పంచి నియోజకవర్గంలోనే మంచి ఎమ్మెల్యేగా పేరు సంపాదించుకోవాలని హితవు పలికారు.

ఆగని వాన.. జనానికి యాతన



ఫరిజల్లిపేటకు వెళ్లే రోడ్డుపై ప్రవహిస్తున్న ముంపు నీరు



రాజానగరంలో సాయిబాబా గుడి వద్ద రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

రాజానగరం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. నాలుగు రోజులుగా కురుస్తున్న ఈ వర్షంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాజానగరం, సూర్యారావుపేట, కానవరం, మల్లంపూడి, తుంగపాడు, నరేంద్రపురం, వెలుగుబంద, దివాన్‌చెరువు ప్రాంతాలలో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే ముంపు నీరు రోడ్లపై కాలువలై ప్రవహిస్తోంది. ముఖ్యంగా దివాన్ చెరువు కూడలి నుంచి శ్రీరామపురం రోడ్డుకు వెళ్లే జంక్షన్ పూర్తిగా ముంపు నీటితో మునిగిపోయింది. దీంతో ఆ రోడ్డు మీదుగా రాకపోకలు సాగించేవారితోపాటు స్థానికులు కూడా అనేక ఇబ్బందులు పడుతున్నారు.

నిలిచిపోయిన ఏడీబీ రోడ్డు అభివృద్ధి పనులు

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో ఏడీబీ రోడ్డు అభివృద్ధి పనులకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. దీంతో పనులను తాత్కాలికంగా ఆపివేశారు. ఈ కారణంగా మండలంలోని రామస్వామిపేట వద్ద అసంపూర్తిగా నిలిచిపోయిన పనులతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆ ప్రాంతంలో రహదారి గోతులు పడివుండటంతో ఆ గోతుల్లోకి వర్షం నీరు చేరి, ప్రయాణికులు వాటిలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు.



వెంకటాపురంలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

ఆగని వర్షం.. రోడ్లు జలమయం

రంగంపేట: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లు ఛిద్రంగా మారాయి. ఎడతెరిపి లేని వర్షాలకు రహదారులు జలమయమయ్యాయి. ఇప్పటికే గుంతలు ఉన్న రోడ్లు ఈ వర్షంతో మరింత పెద్దవయ్యాయి. దీంతో వాహనచోదకులు, పాదచారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాగా మెట్టప్రాంత మైన రంగంపేట మండలంలో ఈ వర్షాల వల్ల పంటలకు ఎంతో ఉపయోగమని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఖరీఫ్‌లో సాగు చేసిన వరి పంటకు ఈ వర్షాలు ఎంతో ఊరటనిచ్చాయి. అదేవిధంగా ఉద్యాన పంటలైన ఆయిల్‌పామ్, బొప్పాయి, మొక్కజొన్న, కూరగాయ పంటలకు ఈ వర్షం ఎంతో ఉపయోగపడుతుంది.

బీమాకు దూరంగా రైతులు



వ్యవసాయ పనులు చేస్తున్న రైతులు

బిక్కవోలు: రైతు సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం విస్మరిస్తోంది. ఉచిత పంటల బీమా పథకాన్ని కూటమి ప్రభుత్వం అటకెక్కించి రైతులపై భారం మోపుంది. ప్రీమియం సొమ్ము చెల్లిస్తేనే పంటల బీమా వర్తించేలా మార్గ దర్శకాలను జారీ చేసింది. కూటమి ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతో అన్నదాతలపై కొట్లాది రూపాయాల ప్రీమియం భారం పెట్టారు. ఈ నేపథ్యంలో ప్రీమియం సొమ్ము చెల్లించాలడానికి రైతులు ఆసక్తి చూపడంలేదు. అధికారులు తెస్తున్నా ఒత్తిడితో తలకు మించిన భారంగా మారినా అన్నదాతలు ఎవరూ ప్రిమియం కట్టలేదు. కొంత మంది సొసైటీ, బ్యాంకు ద్వారా రుణాలు ఉండడంతో వారు మాత్రమే కట్టారు. ఒక వేళ కట్టిన వర్షాభావంతో పంటలు దెబ్బతిన్నప్పుడు టికీ ఒక రూపాయి కూటమి ప్రభుత్వం పరిహారం అందివ్వదని నమ్మకం రైతులు వెనుకంజు వేశారు. మండలంలోని 8,973 మంది రైతుల గాను 14,978 ఎకరాలు ప్రిమియం చెల్లించాలి కాని సమయం ముగిసిన నాటికి 1,799 రైతులు 1,350 ఎకరాలు మాత్రమే ప్రిమియం చెల్లించారు.1799 రైతులలో 1739 మంది రైతులు సొసైటీ, బ్యాంకు రుణాలు ఉండడంతో చెల్లించారు. వ్యక్తి గత 60 మంది మాత్రమే ప్రిమియం రైతులు చెల్లించారు.

పదోన్నతి పొందిన అధికారికి కాలనీవాసుల సత్కారం



ప్రసాదరావును కాలనీవాసులు సన్మానించిన దృశ్యం

రాజానగరం: డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టుగా పదోన్నతి పొందిన ఎం.వి. ప్రసాదరావును మండలంలోని దివాన్‌చెరువు శివారు విజయేశ్వర కాలనీవాసులు దుశ్శాలువాలతో సన్మానించారు. కాలనీలోని డెవలప్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానికంగా ఉన్న శబరి వృద్ధుల ఆశ్రమంలో ఆదివారం ఈ సత్కారం జరిగింది. కోనసీమ జిల్లా అటవీశాఖ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న తమ కాలనీవాసి అయిన ప్రసాదరావు పదోన్నతి పొందడం తమకెంతో గర్వంగా ఉందని అసోసియేషన్ అధ్యక్షుడు గుబ్బల రాంబాబు హర్షం వ్యక్తం చేశారు. కాలనీలోని సమస్యలను పరిష్కరించడంలోను, అభివృద్ధి పర్చడంలోను ఆయన ఎంతగానో కృషి చేశారన్నారు. ఎం.ఎస్.పి శర్మ, వి.రవీంద్ర, పి.రత్నారెడ్డి, గురవయ్య పాల్గొన్నారు.


వర్షంలో రివిట్‌మెంట్ పనులు వద్దు



వంగలపూడి వద్ద వర్షంలో ఏటిగట్టు రివిట్‌మెంట్ పనులు చేస్తున్న దృశ్యం

సీతానగరం: పురుషోత్తపట్నం – సీతానగరం ఏటిగట్టు రోడ్డు రివిట్‌మెంట్ పనులు వర్షం కురుస్తున్న సమయంలో చేయడంపై సర్వత్రా విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఏటిగట్టు గ్రామాల వైపు వర్షాలకు కోతకు గురైన ప్రాంతాల్లో బండరాళ్లతో రివిట్‌మెంట్ పనులు చేపట్టారు. దీనిలో భాగంగా సిమెంట్ పనులు చేపట్టడంతో వర్షంలో కొట్టుకుపోతోంది. దీంతో పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏటిగట్టుపై రోడ్డు వేస్తే నిలబడదని ఇంజినీరు చెప్పడంతో గట్టు కుంగిపోకుండా ఏటిగట్టు రివిట్‌మెంట్ పనులు చేపట్టారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలలో కూడా పనులు కొనసాగించడంతో పనులు చేసినచోట సిమెంట్ వర్షం నీటికి కొట్టుకుపోతోంది. వర్షంలో చేసే పనుల వల్ల అసలు ఉపయోగం లేదని, ప్రజాధనం వృథా అవుతుందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు తగ్గే వరకు రివిట్‌మెంట్ పనులు నిలిపివేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా కొంపెల్ల వేదశాస్త్ర మహాసభ



వేదశాస్త్ర మహాసభలో మాట్లాడుతున్న పండితులు

సీటీఆర్ఐ: ప్రఖ్యాత వేద శాస్త్ర పండితులు కొంపెల్ల సుబ్బరాయశాస్త్రి సంస్మరణార్థం ఆయన వారసులు స్థాపించిన వేద శాస్త్ర పరిషత్ దశమ వార్షికోత్సవ మహాసభ ఆదివారం త్యాగరాయ నారాయణ దాస సేవాసమితి ఆడిటోరియంలో జరిగింది. ప్రఖ్యాత వేద పండితులు ఓరుగంటి గురుప్రసాద లక్ష్మీనారాయణ శర్మ భాగవత ప్రాశస్త్యాన్ని వివరించారు. ఎన్ని యజ్ఞ యాగాదులు చేసినా, మానవుడు సాధించ వలసిన అంతిమ లక్ష్యం జన్మ రాహిత్యమే అన్నారు. లౌకిక విద్య, సంపద, స్వర్గాది సుఖాలు కూడా మానవుని పరిపూర్ణ స్థితికి తీసుకు వెళ్లవని, వేదాంత విద్య ఒక్కటే ఆ స్థితికి తీసుకువెళ్లగలదని ఆయన వివరించారు. భాగవతం అద్వైతాన్ని ప్రతిపాదిస్తున్నదని, కొంపెల్ల సుబ్బరాయ శాస్త్రికి భాగవత పారాయణ ఆరో ప్రాణమని అన్నారు. మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ మాట్లాడుతూ కర్మాచరణ వల్ల చిత్తశుద్ధి, చిత్తశుద్ధి ద్వారా జ్ఞానం, జ్ఞానం వలన మోక్షం సిద్ధిస్తాయని అన్నారు. అజ్ఞాన నివృత్తి మానవ జీవితానికి లక్ష్యం కావాలన్నారు. కార్యదర్శి కొంపెల్ల సత్యనారాయణశాస్త్రి కార్యదర్శి నివేదికను సమర్పించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కంబాలచెరువు: చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. స్థానిక రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రైల్వేస్టేషన్ వద్ద శనివారం సుమారు 25 నుంచి 30 ఏళ్ల వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. స్థానికుల సహకారంతో 108లో అతడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు. అతడి ఆచూకీ తెలిసిన వారు టూటౌన్ పోలీస్ స్టేషన్, 94407 96576, 96521 55779 నంబర్లలో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

ప్రమాద భరితంగా బావి



సుభద్రంపేట -దొడ్డిగుంట ప్రధాన రహదారి పక్కన కూలిపోయిన నుయ్యి

రంగంపేట: సుభద్రంపేట గ్రామ శివారు రోడ్డు పక్కన ఉన్న బావి ప్రమాదభరితంగా మారింది. సుభద్రంపేట నుంచి దొడ్డిగుంట, వెంకటాపురం గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఈ నుయ్యి ఉంది. ఎన్నో ఏళ్లుగా సుభద్రంపేట గ్రామ ప్రజల దాహార్తిని తీర్చుతోంది. ఈ నుయ్యి గత కొంతకాలంలో శిథిలావస్థకు చేరింది. వాటర్ ప్లాంట్లు, ఇంటింటికీ కుళాయిలు రావడంతో ఈ నుయ్యిని పట్టించుకునేవారు లేదు. దీంతో పాడుబడిన ఈ నుయ్యి గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కూలిపోయింది. పొరపాటున ఎవరైనా ప్రమాదవశాత్తూ పడితే ఊబిలో కూరుపోయి మృత్యువాత పడే అవకాశం ఉండడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారి పక్కనే ఈ నుయ్యి ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయపడుతున్నారు. చీకటిలో ప్రయాణించేవారు పొరపాటున రోడ్డు పక్కకు వెళితే నూతిలో పడే ప్రమాదం ఉందని, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కూలిపోయిన నుయ్యిని వెంటనే పూడ్చివేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ముగిసిన జన్మాష్టమి వేడుకలు



కోటపాడులో కృష్ణుడి వేషధారణలో చిన్నారులు

రంగంపేట: మండల పరిధిలోని కోటపాడు సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణా జన్మాష్టమి వేడుకల్లో భాగమైన రెండో రోజైన ఆదివారం ఎంతో ఘనంగా జరిగాయి. స్థానిక శ్రీకృష్ణ మందిరంలో సత్య సాయి బాలవికాస్ విద్యార్థులతో కోలాటం, భరతనాట్యం, మహిళా, పురుష యూత్ సభ్యులు కూడా ఉత్సాహంగా కోలాట నత్య ప్రదర్శన, ఉట్టుకొట్టే కార్యక్రమం, మహా మంగళ హారతి ఆహ్లాదంగా జరిగాయి. ప్రసాద వితరణతో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా ముగిసింది.

శ్రీసత్యసాయి మందిరంలో శత జయంతి ఉత్సవాలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఆల్కాట్‌తోట శ్రీసత్యసాయి సేవామందిరంలో శనివారం రాత్రి పరిపూర్ణ మహావతార శ్రీ సత్యసాయిబాబా వారి శత జయంతి ఉత్సవాలలో భాగంగా కృష్ణాష్టమి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. బాలవికాస్ చిన్నారులతో గణపతి అధర్వణ శీర్షం పఠనం, స్వామివారి నామ సంకీర్తన, శ్రీ సత్య సాయిబాలవికాస్ చిన్నారులతో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తేజ, బృంద సభ్యుల 'కన్నా నిదురించరా', అను బృంద సభ్యులతో 'భజరో నందగోపాల' నృత్య రూపకాల ప్రదర్శన సాగింది. బాల గోపాలునికి ఎంతో ఇష్టమైన ఉట్టి కొట్టడం, మహా మంగళహారతి, సాయికృష్ణునికి ఇష్టమైన కాయము, వెన్న, చిత్రాన్నం, లడ్డూలు భక్త బృందానికి ప్రసాదంగా అందజేశారు.